సాక్షి పల్నాడు

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



పెద్దింటమ్మకి బోనాల సమర్పణ

అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మకు గురువారం బోనాలు సమర్పించారు. అనంతరం విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.



అంకమ్మతల్లికి కిలో వెండి వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి సత్తెనపల్లికి చెందిన కొప్పురావూరి సాంబశివరావు, మహాలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విలువ చేసే కిలో వెండిని అందజేశారు.

పింఛన్‌లు పంపిణీ



రొంపిచర్ల: రొంపిచర్ల, అలవాల గ్రామాల్లో పింఛన్ల పంపిణీ తీరును కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పరిశీలించారు. పలువురికి పింఛన్ పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

రాయితీపై సరకుల విక్రయానికి స్పందన



బాపట్ల: తక్కువ ధరలకు నిత్యావసర సరకులను అందించేందుకు ఏర్పాటైన ప్రత్యేక కౌంటర్ సత్ఫలితాలు ఇస్తోందని జేసీ బి.సుబ్బారావు తెలిపారు. బాపట్ల రైల్వే స్టేషన్ వద్ద రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. కందిపప్పు కిలో మార్కెట్‌లో రూ.181 ఉండగా, కౌంటర్‌లో రూ.160 కే ఇస్తున్నామని చెప్పారు. బియ్యం కూడా మార్కెట్ ధర కంటే కిలోపై రూ.10 తక్కువకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, డీఎస్ఓ ఇ.బి.విలియమ్స్, సీఎస్‌డీటీ బి.ఓంకార్, తహసీల్దార్ కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

డీఎంహెచ్ఓ విజయమ్మ



బాపట్ల: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బాపట్లలోని ఏరియా వైద్యశాలలో ఉన్న తల్లుల వార్డును ఆమె గురువారం పరిశీలించారు. తల్లి పాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ముర్రుపాలను బిడ్డ పుట్టిన వెంటనే తాగించాలని సూచించారు. తల్లి పాలు ఇవ్వటం వల్ల రొమ్ముక్యాన్సర్ రాదని తెలిపారు. ఏడో తేదీ వరకు జిల్లావ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టరు టి.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టరు శేషుకుమార్, డాక్టరు విజయలక్ష్మి, బ్రహ్మం, మరియమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను కోసం వెళ్తుండగా ప్రమాదం

ఇద్దరు వృద్ధులకు తీవ్రగాయాలు



మేదరమెట్ల: వృద్ధాప్య పింఛను తీసుకోవడం కోసం స్కూటీపై వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం కొరిశపాడు జాతీయ రహదారి ఫ్లైఓవర్ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పంగులూరు మండలం కొండమూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రేణంగివరం గ్రామానికి చెందిన రామచంద్రరావు ఒంగోలులో ఉంటున్నారు. గురువారం పింఛన్ కోసం వారి గ్రామాలకు స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో కొరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. మంగళగిరికి చెందిన రేచర్ల జయంత్ పృథ్వీరాజ్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ పీఆర్వో డీవీవీ సత్యనారాయణ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

రేషన్‌కు కత్తెర

కూటమి ప్రభుత్వ తీరు

- ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం
- 2 నెలలుగా అందని చక్కెర
- పంపిణీకి నోచుకోని కందిపప్పు
- అరకొరగా గోధుమపిండి పంపిణీ
- పేదలకు బియ్యంతో సరిపెట్టిన ప్రభుత్వం

నాడు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసింది. పేదల ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీతోపాటు చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి పంపిణీ చేసింది.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి వద్దనే రేషన్ పంపిణీ వ్యవస్థకు స్వస్తి పలికేందుకు సిద్ధమైంది. పలు కారణాలతో చక్కెర, కంది పప్పు, గోధుమ పిండి పంపిణీ నిలిపివేసింది.







నరసరావుపేటటౌన్: గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ సరుకులు ఇంటికి వచ్చేవి. అడగకుండానే కందిపప్పు, పంచదార, గోధుమ పిండి వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అడ్డూ అదుపూ లేకుండా హామీలు గుప్పించింది. కందిపప్పు, గోధుమలు, చక్కెర రాయితీకి అందిస్తామని ప్రగల్భాలు పలికింది. తీరా అమలులో చూస్తే సవాలక్ష వంకలు చెప్పి పేదలకు అందాల్సిన కందిపప్పు, గోధుమలు, చక్కెరకు మంగళం పలికింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో కంది పప్పు రూ.175 నుంచి రూ.180 వరకు ఉంది. రాయితీపై ప్రభుత్వం రూ.67కు అందిస్తామని చెప్పింది. కానీ ఎక్కడా ఇది అమలు జరిగిన దాఖలాలు లేవు. నరసరావుపేట నియోజకవర్గంలో 76,667 మంది తెల్లకార్డు దారులు ఉన్నారు. వీరికి పంపిణీ చేసేందుకు 80 టన్నుల గోధుమపిండి అవసరం అయితే ఈ నెల 18.5 టన్నుల మాత్రమే అలాట్ అయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో గోధుమపిండి సరఫరా చేయకుండా పట్టణాల్లో 50 శాతం ఎంఎల్ఎస్ గోదాం నుంచి దుకాణాలకు దిగుమతి చేశారు. పల్నాడు జిల్లాలో 6,45,100 మంది కార్డుదారులు ఉన్నారు. ఒక్కొక్క కార్డుదారుడికి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోధుమ పిండి అందించాల్సి ఉంది.

బియ్యంతో సరిపెట్టారు..

రేషన్ దుకాణాల ద్వారా ఆగస్టు నెలకు సంబంధించి ప్రజా పంపిణీ గురువారం ప్రారంభమైంది. చౌక దుకాణాల్లో బియ్యం మినహా మరే నిత్యావసర సరుకులు అందించక పోవటంతో కార్డుదారులు నిరాశ పడ్డారు. బహిరంగ మార్కెట్‌లో పంచదార, కందిపప్పు ధరలు అధికంగా ఉండటంతో చౌక దుకాణాల ద్వారా వాటిని పొందేందుకు వచ్చిన కార్డుదారులు భంగపాటుకు గురయ్యారు. ఒక్కో కార్డుదారుడికి ఉచిత బియ్యంతోపాటు సబ్సిడీ ధరకు గోధుమపిండి కేజీ, కందిపప్పు కేజీ చొప్పున, చక్కెర అర కేజీ పంపిణీ చేయాలి. అయితే బియ్యం ఒక్కటే పంపిణీ చేసి చక్కెర, కంది పప్పు ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది.

మంత్రి చెప్పారంట.. అందుకే ఆపారంట

చక్కెర ప్యాకెట్ల తూకంలో తేడా వస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన చక్కెర సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో పేదలు చక్కెర లేదనే చేదు నిజం వినాల్సి వచ్చింది. ఎక్కడైనా తూకంలో తేడా వస్తే .. ఆ ప్రాంతంలో వారిపై చర్యలు తీసుకోవాలి. కానీ రాష్ట్ర వ్యాప్తంగా చక్కెర సరఫరాను నిలిపివేయడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పౌరసరఫరాల గోదాంలో పంచదార స్టాక్ ఉన్నప్పటికీ మంత్రి ఆదేశాలతో పేదలకు చేరటంలేదు. నరసరావుపేట ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలో ప్రస్తుతం 20 టన్నుల పంచదారను అధికారులు పరిశీలించారు. తూకంలో ఎటువంటి తేడా లేకపోయినా పంచదార విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవటంతో పంపిణీ నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు సంబంధం లేదని మండిపడుతున్నారు.

జల్ శక్తి అమలుపై నివేదిక రూపొందించండి

జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



కలెక్టరేట్ సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జల్ శక్తి అభియాన్ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై వాస్తవ నివేదిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు డ్వామా పీడీ జోసెఫ్ కుమార్‌ను ఆదేశించారు. ఆగస్టు రెండో వారంలో జల్ శక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి సాల్మన్ ఆరోగ్యరాజ్ జిల్లా పర్యటన నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలు, అటవీకరణ-పచ్చదనం గణాంకాలను నివేదికలో స్పష్టంగా పొందుపరచాలన్నారు. నోడల్ అధికారి పర్యటన ఆద్యంతం చెరువుల నవీకరణ, ఫారం పాండ్ల నిర్వహణ, గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి సరఫరా, ప్రభుత్వ కార్యాలయాల్లో నీటి నిర్వహణ వంటి కార్యక్రమాల వివరాలు ముందుగానే సిద్ధంచేసి ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలతో కలెక్టరేట్‌లోని జాషువా సమావేశమందిరంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న సీడ్ బాల్స్ క్యాంపెయిన్‌లో నోడల్ అధికారిని భాగస్వామిని చేస్తూ వినుకొండ అటవీ ప్రాంతంలో 25,000 సీడ్ బాల్స్‌తో అటవీకరణ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా అటవీ అధికారి రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ సురేశ్, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, జిల్లా భూగర్భ జల అధికారి టి.ఎస్.శర్మ, మైనర్ ఇరిగేషన్ డీఇ శ్రీనివాసరావు, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఎస్ఈ వరలక్ష్మి, డీపీఆర్వో ఓం.ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతతో సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: పేద ప్రజలకు నిబద్ధతతో సంక్షేమం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 11,12,19 వార్డులతోపాటు చిలకలూరిపేట మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెంలలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.వెయ్యి పెంచి పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రూ.2,800 కోట్లను ఒక్క రోజులో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలిరోజే 96శాతం తగ్గకుండా పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత మాత్రం అనుకూలంగా లేకపోయినప్పటికీ చిత్తశుద్ధితో సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. వినుకొండ పట్టణంలో ఇద్దరి మధ్య జరిగిన పాత గొడవల కారణంగా జరిగిన హత్యను రాజకీయ హత్యగా చిత్రీకరించాలని చూస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపు

తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించిన డీఎంహెచ్‌వో



బాలింతల వార్డులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించటం వలన రోగనిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. గురువారం నుంచి వారం రోజులపాటు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఏరియా హాస్పిటల్‌లోని బాలింతల వార్డులో ప్రారంభించారు. పలువురు తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. అంతేగాకుండా ఆరునెలలు వచ్చేంతవరకు తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం అందించాలన్నారు. తల్లులు పాలు ఇవ్వటం వలన రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు దూరంగా ఉంటారని పేర్కొన్నారు. జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్, డీఎంవో డాక్టర్ హనుమకుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్రరత్నాకర్, డీపీఎం వన్నూరుబాషు, సిబ్బంది పాల్గొన్నారు.

538 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



నాగార్జునసాగర్ జలాశయం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరగటంతో ఒక్క రోజులో 11 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. గురువారం సాయంత్రం 7గంటలకు సాగర్ జలాశయ నీటిమట్టం 538.00 అడుగులకు చేరింది. ఇది 184.1840 టీఎంసీలకు సమానం. శ్రీశైలం జలాశయం నుంచి 10 క్రస్ట్‌గేట్ల ద్వారా 3లక్షల 17వేల 940 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన అనంతరం మొదటి పవర్‌హౌస్ ద్వారా 24,917 క్యూసెక్కులు, రెండో పవర్‌హౌస్ ద్వారా 35,315 క్యూసెక్కులు మొత్తం సాగర్ జలాశయానికి 3,71,693 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 884.50 అడుగుల వద్ద ఉండగా ఇది 212.9198 టీఎంసీలకు సమానంగా ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 3,19,682, రోజా నుంచి 22,349 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దీంతో మొత్తం శ్రీశైలం జలాశయానికి 3,42,031 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సర్కార్ బడుల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 8న నూతన కమిటీల ఎన్నికకు ఏర్పాట్లు
- అదే రోజూ కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ
- జిల్లాలో 1,576 పాఠశాలల్లో కొత్తగా కమిటీలు



సత్తెనపల్లి సుగాలీ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల నోటీస్ బోర్డులో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్

ఎన్నికలు జరిగేవి	
ప్రాథమిక పాఠశాలు	1173
ప్రాథమికోన్నత	149
జెడ్పీ ఉన్నత పాఠశాలలు	174
సీనియర్ సెకండరీ పాఠశాలలు	80

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీల స్థానంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 8వ తేదీన నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతోపాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలలో ఈ ఎన్నికలను నిర్వహిస్తారు.

గడువు ముగిసిన కమిటీలు

గత ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీల పదవీకాలం 2023 సెప్టెంబర్ 21తో ముగిసింది. అనంతరం పాత వాటినే కొనసాగించారు. ప్రస్తుతం వాటి స్థానంలో కొత్తగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా పేరు మార్చి ఈ నెలలో కమిటీలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష చర్యలు తీసుకుంది. జిల్లాలో 1,173 ప్రాథమిక పాఠశాలలు, 149 ప్రాథమికోన్నత పాఠశాలలు, 174 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 80 సీనియర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రభుత్వ అనుసంధానంగా ఉన్న గురుకులాలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఈనెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. పాఠశాల యూనిట్‌గా ఈ ఎన్నికలు జరుగుతాయి. ఆయా పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలలో 15 మంది, యూపీ పాఠశాలలో 21 మంది, ఉన్నత పాఠశాలలో 24 మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరూ కో ఆప్షన్ సభ్యులు ఉంటారు. ఈ ఎన్నికలను పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

షెడ్యూల్ ఇలా...

జిల్లాలోని ప్రతి పాఠశాల నోటీసు బోర్డులో గురువారం ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఓటరు జాబితాను నోటీసు బోర్డులో ఉంచారు. ఈనెల 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించడం, పరిష్కరించడం అదే రోజు సాయంత్రం 3–4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. ఈనెల 8న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నికల నిర్వహణ పూర్తి చేయడం, రెండు గంటలకు కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణస్వీకారం, అనంతరం 3 గంటలకు నూతన ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించేలా ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

ఎన్నికలు కట్టుదిట్టంగా నిర్వహిస్తాం

జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. విద్యా శాఖ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఎస్ఎంసీ ఎన్నికలు సక్రమంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖ అధికారులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.

– ఎం వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, పల్నాడు జిల్లా

చెరువులకు జలకళ



గణపవరం చెరువుకు చేరుతున్న సాగర్‌జలాలు

తుర్లపాడు మేజర్ కాలువ ఆయకట్టు చివరి చెరువులకు మంగళవారం రాత్రి నుంచి సాగర్ జలాలు చేరుతున్నాయి. మొదటి చెరువు 50 శాతం గురువారం నాటికి నిండగా, మరో మూడు రోజులపాటూ చెరువుకు నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ తుర్లపాడు మేజర్ కాలువ పరిధిలోని అన్ని చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఏప్రియల్ చివరిలో చెరువులను సాగర్ జలాలతో నింపారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు అడుగంటటంతో మరోదఫా సాగర్ జలాలు విడుదల చేయగా, పంచాయతీ, సచివాలయ అధికారులు రాత్రింబవళ్లు చెరువులు నింపే పనిలో నిమగ్నమయ్యారు.

– నాదెండ్ల

చౌక దుకాణాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్



రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ డీటీ కొండారెడ్డి

నరసరావుపేటటౌన్: రేషన్ దుకాణాలపై పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఒక వైపు అధికారులు చౌక దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా మరోవైపు డీలర్‌లు దుకాణాలు మూసివేసి అజ్ఞాతంలోకి జారుకున్నారు. ప్రజా పంపిణీ బియ్యం పంపిణీకి ముందే నల్లబజారుకు తరలించిన వ్యవహారంపై గురువారం 'పేదోడి మెతుకులూ మెక్కుతున్న తమ్ముళ్లు' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి పద్మశ్రీ మూడు బృందాలను ఏర్పాటు చేశారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చౌకదుకాణాలకు చేరుకున్నారు. రేషన్ షాపులు తనిఖీ చేసి కేటాయించిన బియ్యం, ఉన్న స్టాక్‌కు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించారు. అధికారులు తనిఖీల సమాచారం తెలుసుకున్న డీలర్‌లు కొందరు సెల్‌ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేసుకొని వెళ్లారు. ఎంతసేపటికీ వారు అందుబాటులోకి రాక పోవటంతో చేసేదేమీలేక అధికారులు వెనుదిరిగారు. అధికారులు దుకాణాలను పరిశీలించి నివేదిక ఇచ్చిన అనంతరం చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో పద్మశ్రీ తెలిపారు.

క్లుప్తంగా

చారిత్రక స్థలాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని వారసత్వ కేంద్రాలు చారిత్రక స్థలాలైన అమరావతి, నాగార్జునకొండ లేపాక్షి, గండికోట, శాలిహుండం, శంకరంలను అభివృద్ధి చేయటానికి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. గురువారం డిల్లీలో కేంద్ర పరావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదు బీర్ సింగ్ రావత్‌కు వినతిపత్రం సమర్పించారు అనంతరం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక స్థలాలును పరిరక్షించి లేపాక్షి, గండికోట, శాలిహుండం, శంకరం వంటి ప్రదేశాలలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పర్యాటకులను అధికంగా సందర్శించే ఈ ప్రదేశాలను అభివృద్ధి చేయటానికి ప్రత్యేక నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ

7 క్వింటాళ్ల బియ్యం అక్రమ నిల్వ గుర్తింపు



పిట్టలవానిపాలెం: రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన అధికారులు అక్రమంగా 7 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండలంలోని ఖాజీపాలెంలో చోటుచేసుకుంది. గ్రామంలోని 22వ నెంబర్ రేషన్ దుకాణంలో గురువారం బాపట్ల పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు ఓంకార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్‌లు రమేష్ రెడ్డి, అబ్రహాంలు తనిఖీ నిర్వహించారు. ఉదయం 8 గంటలకే 50 మంది కార్డుదారులకు బియ్యం ఇచ్చినట్లుగా బయోమెట్రిక్ నమోదు చేశారు. 7 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉన్నట్లుగా గుర్తించారు. నిర్వాహకురాలు ప్రభుకుమారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఓంకార్ తెలిపారు.

కొల్లూరు మాజీ సర్పంచి ఆత్మహత్య

కొల్లూరు: కొల్లూరు మాజీ సర్పంచి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు గౌడపాలెంకు చెందిన మార్గన శివకుమారి (42)కి కొన్ని నెలలుగా భర్త శ్రీనుతో కలహాలు కొనసాగుతున్నాయి. ఇటీవల భర్తకు దూరంగా తన కుమార్తె వద్ద ఉంటున్నారు. కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడంతో దంపతులు కలిశారు. నాలుగు రోజుల క్రితం తిరిగి వివాదం రేగడంతో భర్త హైదరాబాద్ వెళ్లారు. మనస్తాపానికి గురైన శివకుమారి ఇంట్లో ఉరేసుకుని చనిపోయారు. గురువారం ఉదయం ఆమె బయటకు రాకపోవడంతో అదే భవనం పై అంతస్తులో ఉంటున్న అత్తమామలు వచ్చి పిలిచారు. బదులు రాకపోవడంతో తలుపులు తెరిచి చూడగా విషయం వెలుగుచూసింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కొల్లూరు పోలీసులు తెలిపారు.

లయోలాలో ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అండర్-17 విజేతలతో స్కూల్ యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడాకారులు ఓటమితో కుంగిపోకుండా, ధైర్యంగా నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుంటూ ముందుకు సాగాలని హైదరాబాద్ సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ కమిషనర్, ఆంధ్ర రీజియన్ బాస్కెట్ బాల్ టెక్నికల్ కమిటీ చైర్మన్ జి.సురేష్ బాబు తెలిపారు. గత మూడు రోజులుగా రూరల్ మండలంలోని నల్లపాడు గ్రామంలోగల లయోలా పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రీజినల్ స్థాయి ఐసీఎస్ఈ, ఐఎస్ఈ బాలికల బాస్కెట్ బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ధైర్యంగా ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి, జీవితంలో స్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.రేవతి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యతోపాటు, క్రీడలు భాగంగా ఉండాలని అప్పుడే విద్యార్థులు శారీరకంగా మానసికంగా బలంగా ఎదుగుతారన్నారు. పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పి.ఆంథోని, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్, ఫాదర్ నరేష్‌లు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. మొత్తం 42 జట్లు పోటీలలో పాల్గొన్నాయన్నారు. ఫైనల్ పోటీల్లో అండర్-14 విభాగంలో హైదరాబాదుకు చెందిన ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ప్రథమ స్థానం, హబ్సిగూడ సెయింట్ జోసఫ్స్ స్కూల్ ద్వితీయ స్థానం, సికింద్రాబాద్‌కు చెందిన షేర్‌వుడ్ పబ్లిక్ స్కూల్ తృతీయ స్థానాన్ని కైవశం చేసుకున్నాయన్నారు. అండర్-17 విభాగంలో హైదరాబాద్ బేగంపేటకు చెందిన ది హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ ప్రథమస్థానం, హైదరాబాద్‌కు చెందిన ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ద్వితీయ స్థానం, ఖైరతాబాద్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ గరల్స్ స్కూల్ తృతీయ స్థానం సాధించాయన్నారు. అండర్-19 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ప్రథమస్థానం, బేగంపేటకు చెందిన ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానం, మల్లాపూర్‌కు చెందిన జాన్సన్ గ్రామర్ స్కూల్ తృతీయ స్థానంను కై వశం చేసుకున్నాయన్నారు. విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు, ఉపాధ్యాయులు, యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



హైదరాబాద్ ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ అండర్-14 విజేతలతో స్కూల్ యాజమాన్యం



అండర్-19 విజేతలతో స్కూల్ యాజమాన్యం

ప్రారంభమైన అండర్-19 క్రికెట్ పోటీలు

- తొలి మ్యాచ్‌లో తలపడ్డ తూర్పుగోదావరి, కర్నూలు జట్లు
- సెంచరీతో చెలరేగిన సూర్యదిలీప్, 127 నాటౌట్
- ఐదు వికెట్లు సాధించిన కర్నూలు బౌలర్ రోహిత్



127 పరుగులతో నాటౌట్ గా సూర్యదిలీప్



ఐదు వికెట్లు తీసిన రోహిత్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 145 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని భార్గవ చంద్రప్రసాద్ 37 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి బౌలర్ మోజస్ నాలుగు వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లు కోల్పోయి 176 పరుగులు సాధించింది. జట్టులోని జి.సూర్యదిలీప్ 117 బంతుల్లో 127 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచారు. కర్నూలు బౌలర్ వి.రోహిత్ ఐదు వికెట్లు సాధించాడు. తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 31 పరుగుల ఆధిక్యంలో ఉంది. శుక్రవారం రెండవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

గ్రామ సచివాలయానికి టీడీపీ ఫ్లెక్సీలు



గుంటూరు రూరల్: ప్రభుత్వ కార్యాలయాలను సైతం పార్టీ కార్యాలయాలుగా మార్చేశారు టీడీపీ కూటమి నాయకులు. ప్రభుత్వ కార్యాలయాలకు సైతం పార్టీ ఫ్లెక్సీలను యథేచ్ఛగా కట్టడంపై ప్రజలు విస్తుబోతున్నారు. వెంగళాయపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయంపై మహాత్మా గాంధీ గ్రామ సచివాలయం అని రాసి ఉన్న స్థానంలో బోర్డు కనిపించకుండా పార్టీ ఫ్లెక్సీలను స్థానిక టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. కనీసం సచివాలయ బోర్డు సైతం కనిపించకుండా టీడీపీ ఫ్లెక్సీలు కట్టడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.3వేల నగదు స్వాధీనం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముగ్గురోడ్డు వద్ద నివాసాల మధ్యలో ఉన్న పేకాట స్థావరంపై గురువారం తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక మహిళతో పాటు నలుగురు పురుషులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురోడ్డులో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సీఐ కళ్యాణ్‌రాజు ఆదేశాల మేరకు ఆ ఇంటిపై నిఘా ఏర్పాటు చేసి దాడిచేశామని, ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఒక మహిళతో పాటు నలుగురు పురుషులను అదుపులోకి తీసుకొన్నామన్నారు. వీరివద్ద రూ. 3 వేలు లభించిందని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

మరో పేకాట నిర్వాహకుడికి కౌన్సెలింగ్!

తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న ఓ యువకుడిని తాడేపల్లి పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి, పేకాట నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించి వదిలివేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా అటువంటిది ఏమీలేదని పేకాట నిర్వాహకులపై నిఘా ఏర్పాటు చేసింది వాస్తవమేనని ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని తెలియజేశారు.

జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ అడిషనల్ కమిషనర్‌గా సౌమ్య



లక్ష్మీపురం: గుంటూరులోని జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయ అడిషనల్ కమిషనర్‌గా నూతలపాటి సౌమ్య నియమితులయ్యారు. ఈమె విజయవాడలోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై గుంటూరుకు రానున్నారు. గుంటూరు అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.మధుసూదనరెడ్డిని, గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా నియమించారు. జీఎస్టీ, కస్టమ్స్ కేసులకు సంబంధించిన అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయం రాష్ట్రంలో గుంటూరులో మాత్రమే ఉంది.

నూతన తహసీల్దార్లు వీరే

వెంటనే బాధ్యతలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఉత్తర్వులు

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా పలు మండలాలకు తహసీల్దార్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో పలు మండలాలకు తహసీల్దార్లుగా వ్యవహరించిన వారిని వారి సొంత జిల్లాలకు బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఖాళీగా ఉన్న పలు మండలాలకు తహసీల్దార్లను కలెక్టర్ నియమించారు. వైవీబీ కుటుంబరావు దాచేపల్లి తహసీల్దార్‌గాను, జి.కరుణకుమార్‌ను రెంటచింతల, పెదకూరపాడుకు ఎం.దానియేలు, కారెంపూడికి బీవీఆర్‌సీహెచ్ ప్రసాదు, సత్తెనపల్లికి కేఎస్ చక్రవర్తిని నియమించారు. అలాగే నూజెండ్లకు జి.రమేష్‌కుమార్, అచ్చంపేటకు జి.శ్రీనివాసరావు, ముప్పాళ్లకు షేక్ మహమద్ హుస్సేన్, నకరికల్లుకు కె.పుల్లారావు, క్రోసూరుకు జి.సుజాత, అమరావతికి ఎస్.నాగమల్లేశ్వరరావు నియమితులయ్యారు. యడ్లపాడుకు ఏవీ రమణ, మాచవరంకు ఏవీ సుధాకర్, గురజాలకు కె.నాగేష్, పిడుగురాళ్లకు జె.మధుబాబు, నాదెండ్లకు జి.విజయశ్రీ, రాజుపాలెంకు ఎస్.దుర్గేశ్వరరావు, మాచర్లకు మహమద్ జియా హుల్‌హక్, చిలకలూరిపేటకు ఎం.భవానిశంకర్, వినుకొండకు ఎస్.సురేష్, దుర్గికి జి.వేణుగోపాల్, బెల్లంకొండకు మహమద్ అష్రఫున్నీసా బేగంను నియమించారు. కాగా, పలువురు తహసీల్దార్లను జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పలు విభాగాల్లో నియమించారు. వారు బి.కిరణ్‌కుమార్ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ సూపరిండెంట్, ఎస్.శివనాగిరెడ్డిని ల్యాండ్ మాటర్ సెక్షన్ సూపరింటెండెంట్, ఆర్.యశోధను కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ గా నియమించగా, ఎం.క్షమారాణిని మెజిస్ట్రీరియల్ సూపరింటెండెంట్ గా నియమించారు. డి.మస్తాన్‌ను నరసరావుపేట, ఏవీపీ చంద్రారెడ్డిని సత్తెనపల్లి ఆర్డీవో డీఏవోలుగా నియమితులయ్యారు. వీరందరూ వెంటనే బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మూర్తింజాపురంలో 12 పింఛన్లు నిలిపివేత

సచివాలయంలో లబ్ధిదారుల పడిగాపులు



గ్రామ సచివాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

వినుకొండ(నూజెండ్ల): టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దురుద్దేశపూర్వకంగా తమ పింఛన్లు ఆపివేశారని పింఛన్లను ఇప్పించాలని కోరుతూ మూర్తింజాపురం గ్రామానికి చెందిన 12 మంది పింఛన్ లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో అధికారులను ప్రశ్నించారు. గ్రామానికి చెందిన దేవినేని బాలసుబ్బారావు, మాగులూరి వెంకయ్య, దగ్గుబాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, దేవినేని చంద్రమౌళి, చింతలచెరువు వెంకటనారాయణ, చిన్నబోయిన చినకోటయ్య, చింతలచెరువు బాదుల్లా, బండారు వెంకటేశ్వర్లు, పసుపులేటి వెంకాయమ్మలు పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లగా తమ పింఛన్ ఆగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశామని ఉద్దేశపూర్వకంగా పింఛన్లు ఆపివేశారని, గతంలో ఎంపీడీవో కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీపై ఎలాంటి హామీ రాకపోవడంతో సచివాలయంలో వేచి చూసి వెనుతిరిగి వెళ్లారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణతో చక్కని ఉపాధి

- ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామి
- శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు పొందిన డ్రైవర్లతో డిపో మేనేజర్ వీరాస్వామి

నరసరావుపేట: భారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు కొరత ఉన్నందున ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూలులో చేరి శిక్షణ పూర్తిచేసుకున్న వారికి మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి పేర్కొన్నారు. గురువారం హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై వారికి సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. శిక్షణ పొందిన డ్రైవర్లకు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ప్రమాదాలు జరగకుండా తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఇంధన పొదుపు గురించి తెలియచేశారు. హెవీ లైసెన్స్ కల్గిన డ్రైవర్లకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని, ఆర్టీసీలో కూడా అవకాశాలు వస్తాయని తప్పకుండా తమ వద్ద శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇప్పుడు 17వ బ్యాచ్‌కి ప్రవేశాలు జరుగుతున్నాయని, సీట్లు పరిమితంగా ఉన్నందున లైట్ లైసెన్స్ కల్గి హెవీ లైసెన్స్ పొందగోరు డ్రైవర్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి గాను ఫోన్ నెంబర్లు 73828 96038, 73828 96158, 99592 25428లను సంప్రదించాలని కోరారు.


రైతులు ముందుగానే విత్తన శుద్ధి చేసుకోవాలి



అనుపాలెంలో నారుమళ్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, అధికారులు

రాజుపాలెం: రైతులు నారుపోసుకునే ముందుగా వరి విత్తనాలను శిలీంద్రనాశక మందులతో విత్తనాలను శుద్ధి చేసుకుని నారుమడిలో చల్లినట్లయితే నారుకు తెగుళ్ల రాకుండా అరికట్టవచ్చని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని అనుపాలెం సమీపంలో గల వరి నారుమళ్లను గురువారం రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడుతూ నాటు వేసే ఏడురోజుల ముందుగా ఇక ఎకరానికి సరిపడు నారుమడిలో కిలో కార్బోఫ్యూరాన్ 3-జి, కిలో గుళికలను పలుచగా నీరు ఉంచి ఇసుకలో కలిపి చల్లినట్లయితే పైరుకు నెలరోజుల వరకు కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు తెగులు రాకుండా ముందస్తుగా నివారించుకోవచ్చని చెప్పారు. 30 రోజుల నారును పొలంలో నాటినట్లైతే పైరుబాగా పెరిగి పిలకలు వచ్చి దుబ్బు చేసి ఎక్కువ దిగుబడులు వచ్చుటకు అవకాశం ఉందని తెలిపారు. ఒక చదరపు మడులకు 33 కుదుళ్లు ఉండే విధంగా నాటు వేసుకున్నట్లయితే చీడపీడలు ఆశించకుండా ఉంటాయని తెలిపారు. అనంతరం రాజుపాలెంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను కలసి కౌలు రైతులకు రుణాలు అందించాలని చెప్పారు. ఆయన వెంట ఏడీఏ వి.హనుమంతరావు, ఏవో పి.వెంకటనర్సయ్య, వ్యవసాయ సహాయకులు డి.వెంకటేష్, చిన్నబోయిన రాఘవ యాదవ్, గంజి శ్రీను, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు



సదస్సులో అమెరికా ప్రతినిధులతో ఆర్‌వీఆర్‌జేసీ నిర్వహణ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: ప్రపంచంలోని అగ్రదేశాల సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తల ద్వారా విశ్వసాంకేతిక విజ్ఞానాన్ని పరిచయం చేస్తూ నిర్వహించిన ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు 2024 కార్యక్రమానికి తమ కళాశాల సారథ్యంలో నిర్వహించడం అద్భుత అవకాశమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేనిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇటీవల ఆర్‌వీఆర్‌జేసీ సారథ్యంలో ఐఈఈఈ, ఐఈఎస్, స్టూడెంట్ అండ్ యంగ్ ప్రొఫెషనల్స్ అంతర్జాతీయ సదస్సు 2024 మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమానికి అమెరికాలోని ఐఈఈఈ, ఐఈఎస్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మిలోస్ మానిక్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆంటోనియో ల్యూక్యూ ముఖ్య అతిథులుగా వివిధ దేశాల నుంచి 92 మంది ప్రతినిధులతో కూడిన బృందం పాల్గొన్నారని తెలిపారు. ఈ సదస్సులో గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీస్, అవకాశాలు, సవాళ్లు, పరిష్కారాలు అనే ప్రధాన అంశంపై, స్మార్ట్ గ్రిడ్, ఇండస్ట్రీ 4.0, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ ఇతర అత్యాధునిక సాంకేతికతలపై నిపుణులు తమ సందేశాలను అందించారని కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పి.త్రిపుర తెలిపారు. అంతర్జాతీయ సదస్సు అగ్రదేశాల ప్రతినిధుల మన్ననలచే విజయవంతంగా నిర్వహించిన కార్యనిర్వాహణ కమిటీ సభ్యులను కళాశాల యాజమాన్యం అభినందించారు. 2030 నాటికి భారతదేశంలో భారీ హరిత శక్తి పరివర్తనే లక్ష్యంగా ప్రధానఅంశంపై ఈ వేదికలో నిర్వహించడం ఆనందదాయకమని తమ కళాశాల ఉత్తమ నివేదికను పరిగణలోకి తీసుకొని ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతో తమ కళాశాల కీర్తి ప్రపంచ స్థాయికి చేరుకుందని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. గతంలో తమ కళాశాల ద్వారా నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు, సభ్యుల ప్రతిభా నైపుణ్యాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయం అమెరికా నుంచి అనేక అవార్డులను, నగదును పొందడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఐఈఎస్ స్టూడెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఉపాధిహామీ కూలీల ధర్నా

త్వరగా వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



అధికారి జోసెఫ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కూలీలు

.నరసరావుపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతన బకాయిలను వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసి నెలలకు కాస్తున్న వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఉపాధిహామీ కూలీలలో అధికశాతం కూలీలు, పేదలు ఉన్నారని, వారు ఏరోజుకారోజు పని చేసుకొని వేతనాలు తీసుకుంటేనే కుటుంబాలు గడిచే పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో కోతలు విధించిందని, వేతనాలు ఆలస్యం కావటం, వేసవి అలవెన్స్, మజ్జిగ, మంచినీళ్ల ఇతర అలవెన్సులు లేకుండా పోయాయన్నారు. దేశం మొత్తం ఒకే వేతనం, 200 రోజులు పనిదినాలు సాధనకు సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు సన్నద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ జిల్లాలో రూ.40 కోట్ల మేర కూలీలకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేయటానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేవన్నారు. ఉపాధి హామీ పథకం గ్రామస్థాయిలో అమలు కావడంలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలలో రాజకీయ జోక్యంతో పథకం లక్ష్యం పక్కదారి పడుతుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని, సాగర్ కాలువల కింద మాగాణి సాగయ్యే ప్రాంతంలో నీరు వస్తుందో రాదో అర్థం కాని పరిస్థితి ఉన్న నెలకొందన్నారు. భూములు సాగవ్వక, వ్యవసాయ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆయా మండలాల్లో ఉపాధి హామీ పనులను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య మాట్లాడుతూ జాబ్ కార్డులలో చేర్పులు మార్పులకు అవకాశం కల్పించాలని కొత్తవారికి నూతన జాబ్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పిడి జి.జోసెఫ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకులు కొమ్ముల నాగేశ్వరరావు, భగత్, సాతులూరి లూథర్, ఏపూరి వెంకటేశ్వర్లు, బత్తుల బాలకోటయ్య, గురుస్వామి పాల్గొన్నారు.

మెప్మాలో అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

పొన్నూరు: పట్టణంలోని మెప్మా పరిధిలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. మెప్మా పీడీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గత పది రోజుల నుంచి చేస్తున్న విచారణలో అక్రమాలపై ఆధారాలు లభించినప్పటికీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలాయాపనతో ఐదు గ్రూపుల మహిళలు చేసిన ఒక అభియోగంపై చేసిన విచారణ పూర్తయింది. నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని విచారణ అధికారులు రాజశేఖర్, కీర్తి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మరో అంశంపై విచారణ ప్రారంభించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5400, మోడల్ ధర రూ.4800 వరకు పలికింది.